సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 22 । జనవరి । 2024

'హస్తం' కసరత్తు
రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ నుంచి బలమైన అభ్యర్థిని రంగంలోకి దించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. టికెట్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించింది. 8లో▸

రేపు కోర్ కమిటీ సమావేశం
ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ కోర్ కమిటీ సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాయల్ శంకర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంటరీ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలు, కోర్ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలి ప్రభావం కనిపిస్తుంది.


విద్యుత్ కాంతులీనుతున్న హౌసింగ్‌బోర్డులోని శ్రీ రామాలయం


కాషాయమయమైన జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్

అంతా రామమయం..
ఆదిలాబాద్: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో సోమవారం నిర్వహించనున్న రాములల్లా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం పురస్కరించుకొని జిల్లాలో ఘనంగా నిర్వహించుకునేందుకు ఈ ప్రాంతవాసులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే శ్రీరామభక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు జిల్లా కేంద్రాన్ని కాషాయమయంగా మార్చేశారు. ప్రధాన కూడళ్లను కాషాయ పతాకాలతో అలంకరించారు. శ్రీరామునితో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీరామ, హనుమాన్ ఆలయాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక హోమాది, పూజ, కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. అలాగే శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర చేపట్టనున్నారు.

జై శ్రీరామ్..

అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థినులు ఆదివారం జై శ్రీరామ్ ఆకృతిలో కూర్చుని అబ్బురపరిచారు. పీఈటీ సవిత, విద్యార్థినులను ఆర్సీవో గోపీచంద్, ప్రిన్సిపాల్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
ఆదిలాబాద్‌టౌన్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ దృష్ట్యా జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించే శ్రీరామ ర్యాలీ సందర్భంగా ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సీఐలు, సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించే ప్రదేశాలను ఆదివారం సందర్శించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక చౌక్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్‌లలో ప్రజలు వాహనాలతో రాకుండా ఉండాలని, వారి అవసరాలకు పాత జాతీయ రహదారితో పాటు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రశాంతంగా రామ ర్యాలీని నిర్వహించుకునేందుకు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐలు కె.సత్యనారాయణ, కె.అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు
కైలాస్‌నగర్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జిల్లాలో ఆదివారంతో ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉన్నారు. వారి పరిధిలోని 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించారు. అలాగే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులు సైతం స్వీకరించారు. ఈ శిబిరాల్లో అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఫిబ్రవరి 2నుంచి 24లోపు విచారించి పరిష్కరించనున్నారు. కొత్తగా నమోదు చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పించనున్నారు.

రైల్వేలైన్ ఏర్పాటుతో సమస్యలు దూరం
ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ అందుబాటులోకి వేస్తే జిల్లా ప్రజల సమస్యల దూరమవుతాయని ఆర్కిటెక్ట్ ఇంజినీర్స్ అండ్ ఎస్‌టీపీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీష్ అన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కోసం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద చేపడుతున్న రిలే దీక్షలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పటాన్‌చెరు–ఆదిలాబాద్ రైల్వేలైన్ వలన 300 నుంచి 400 కిలోమీటర్ల దూరం పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే 6 నుంచి 8 గంటల సమయం పడుతుందని పేర్కొన్నారు. అదే ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వే లైన్ పూర్తయితే హైదరాబాద్ నగరానికి మూడు గంటలలోపే చేరుకోవచ్చన్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైల్వేలైన్ సాధన సమితి నాయకులు నారాయణ, నరేందర్, ఆంజనేయులు, రఫీక్, అఫ్సర్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్, కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బోధన అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈనెల 25లోగా ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, అదే కళాశాలలో 27న జరిగే డెమోకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వివరించారు.

విద్యార్థులను దేశ భక్తులుగా తీర్చిదిద్దాలి
ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు గురుతర బాధ్యతగా విద్యార్థులను దేశ భక్తులుగా తీర్చిదిద్దాలని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజుల్ వార్ దిగంబర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో గల సరస్వతి శిశుమందిర్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఆదివారం కర్తవ్య బోద్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను గొప్ప దేశభక్తులుగా తీర్చిదిద్దుతూ వారికి దేశంపై ప్రేమ, సామాజిక సేవ, బాధ్యతలపై అవగాహన కల్పించాలని సూచించారు. టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ.. తమ సంఘం జాతీయ సంఘానికి అనుబంధంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ, మహిళా అధ్యక్షురాలు జీజాబాయి, ఆర్థిక కార్యదర్శి నారాయణ, నాయకులు గోమంత్‌రెడ్డి, ప్రకాశ్, రాజేశ్, వసంత్, కేశవ్‌రావ్, దేవ్‌రావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఝరికి పూజలు చేసి మొక్కుతున్న మహిళలు


అల్లుళ్లు, ఆడపడుచులకు కానుకలు వేస్తూ..



గంగాజలం సేకరణకు కాలినడకన వెళ్తున్న మెస్రం వంశీయులు

గోదావరి బాటలో..

- గంగాజలం సేకరణ కోసం..
- మెస్రం వంశీయుల పాదయాత్ర షురూ
- ఈనెల 28న హస్తిన మడుగుకు..

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఉంది. పుష్యమాస అమావాస్య పురస్కరించుకొని కేస్లాపూర్‌లో నిర్వహించే జాతరలో భాగంగా ప్రధాన ఘట్టం మొదలైంది. మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మెస్రం వంశీయులు కేస్లాపూర్‌కు చేరుకొని ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉదయం సమావేశమయ్యారు. గంగాజల సేకరణ పాదయాత్ర, మహాపూజ నిర్వహనపై చర్చించారు. ఝరి(కలశం)దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగాజల సేకరణ పాదయాత్ర ప్రారంభించారు. మెస్రం వంశ అల్లుళ్లు, ఆడపడుచులు బుందో పట్టగా.. వంశీయులు కానుకలు వేసి ముందుకు సాగారు. యాత్ర తొలిరోజు మండలంలోని కేస్లాగూడకు చేరుకుని అక్కడే బస చేశారు. ఈనెల 22న నార్నూర్ మండలంలోని గుంజాల, 23న నాగల్‌కొండ, 24న జైనూర్ మండలంలోని గౌరి, 25న లింగాపూర్ మండలంలోని గుంనూర్, 26న జన్నారం మండలంలోని ఇస్లాంపూర్, 27న దస్తురాబాద్ మండలంలోని మల్లేపూర్ వద్ద బస చేస్తూ వెళ్తుంటారు. ఈ నెల 28న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం గోదావరి నది హస్తిన మడుగుకు చేరుకుంటారు. ప్రత్యేక పూజలు చేసి పవిత్ర గంగాజలం సేకరిస్తారు. అదే రోజు తిరుగు ప్రయణమవుతారు. గంగాజలంతో బయల్దేరి ఉట్నూర్ మీదుగా వచ్చి ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. ప్రత్యేక పూజల అనంతరం అదేరోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో మరిచెట్టు (వడమర) వద్ద బస చేస్తారు. ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు సంప్రదాయ, తూమ్(ఖర్మకాండ)పూజలు చేయనున్నారు. 9న రాత్రి 10:30 గంటల సమయంలో పవిత్ర గంగాజలంతో మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశం పెద్దలు చిన్ను, బాదిరావ్, కోసేరావ్, ఆనంద్‌రావ్, ప్రధాన్ పెద్దలు దాదారావ్, వంశ ఉద్యోగులు సోనేరావ్, మనోహర్, శేఖర్‌బాబు,దేవ్‌రావ్ తదితరులున్నారు.

యాత్రను విజయవంతం చేయాలి
గంగాజలం సేకరణ యాత్రలో పాల్గొంటున్న మెస్రం వంశీయులు నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో ఉండాలని పటేల్ వెంకట్‌రావ్ అన్నారు. యాత్రలో పాల్గొనే వారికి సలహాలు, సూచలు అందించారు. మార్గమధ్యలో బంధువుల ఇళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. వంశ పెద్దల నిర్ణయాలకు కట్టుబడి ఉంటూ యాత్ర విజయవంతం చేయాలన్నారు.

రక్తహీనతకు చెక్

- ఈనెల 24 నుంచి బడులు, కళాశాలల్లో స్క్రీనింగ్
- జిల్లాలో 38,392 మందికి రక్త పరీక్షలు
- 'ఎనిమియా ముక్త్ తెలంగాణ'కు శ్రీకారం


రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: రక్తహీనతతో విద్యార్థులు అనేక రుగ్మతలకు గురవుతున్నారు. దీంతో చదువుపై దృష్టి సారించడం లేదు. తరచూ అనారోగ్యం బారిన పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌమరదశలో ఉండే బాలబాలికలు భవిష్యత్తులో అనేక రోగాల బారిన పడుతున్నారు. రక్తహీనతకు చెక్‌పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఎనిమియా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఎనిమియా ముక్త్ తెలంగాణ'కు శ్రీకారం చుట్టనుంది. ఈనెల 24న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే కార్యక్రమ నిర్వహణకు సంబంధించి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వైద్య పరీక్షల ద్వారా విద్యార్థుల్లో రక్తస్థాయి ఏ విధంగా ఉందనేది తెలియడంతో పాటు రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవసరమైన చికిత్స అందించేందుకు దోహద పడుతుంది. తద్వారా వారికి వచ్చే వ్యాధులను ప్రారంభ దశలోనే కట్టడి చేసే అవకాశం ఉండగా, మరోవైపు విద్యార్థులు చదువుపై దృష్టి సారించనున్నారు.

సర్కారు బడులు, కళాశాలల్లో..
జిల్లాలో 13ప్రభుత్వజూనియర్ కళాశాలలతో పాటు 110 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, పాలిటెక్నిక్, పారామెడికల్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ స్థాయి విద్యార్థులు జిల్లాలో 38,392 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికి ఆయా పాఠశాలలు, కళాశాలల్లోనే రక్త పరీక్షలు నిర్వహించనున్నారు. రోజుకు వంద మంది చొప్పున పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణను రూపొందించారు.

ఎనిమిది బృందాలు..
విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించడం కోసం వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రీయ కిశోర్ స్వస్త్, రాష్ట్రీయ బాల స్వస్త్ ద్వారా చేపట్టనున్నారు. ఇందుకు గాను ఎనిమిది బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఫార్మాసిస్ట్, ఏఎన్ఎంతో పాటు డ్రైవర్‌ను నియమించారు. వీరికోసం ప్రత్యేకంగా వాహనాలను సైతం ఏర్పాటు చేశారు. రోజుకు వంద చొప్పున వైద్య పరీక్షలు పాఠశాలల్లోనే నిర్వహిస్తారు. డిజిటల్ హిమోగ్లోబిన్ మిషన్ ద్వారా శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారిస్తారు. 8 శాతం కంటే తక్కువగా ఉంటే రక్తహీనత ఉన్నట్లుగా నమోదు చేసుకుంటారు. వీరికి ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలను ఉచితంగా అందిస్తారు. 7 శాతం కంటే తక్కువగా ఉంటే తక్కువ శాతం (మోడ్), ఆరు కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా ఉన్నట్లుగా నిర్ధారిస్తారు. వీరిని ఆస్పత్రికి తరలించి రక్తం ఎక్కిస్తారు. అంతే కాకుండా వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉండటానికి గల కారణాలను తెలుసుకుంటారు. ఏవైనా వ్యాధులు ఉన్నాయా అని కూడా రక్తపరీక్షల ద్వారా నిర్ధారించనున్నారు. క్యాన్సర్, రక్తహీనత, తలసేమియా, బ్లడ్ క్యాన్సర్, సికిల్‌సెల్ వంటి తదితర వ్యాధులుంటే మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతారు.

గిరిజనులే అధిక శాతం..
జిల్లాలో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారు. గిరిజనుల్లో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. గర్భిణులు ప్రసవ సమయంలో రక్తం తక్కువగా ఉండటంతో కొంతమంది మృత్యువాత పడుతున్న సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ సమస్యను ప్రారంభ దశలోనే తెలుసుకుని తగు చికిత్స అందిస్తే కౌమారవయస్సులో తలెత్తే ఇబ్బందులు అధిగమించేందుకు దోహదపడుతుంది.

రక్త పరీక్షలకు ముందుకు రావాలి
విద్యార్థులు రక్త పరీక్షలు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు గురికాకుండా పరీక్షలు చేయించాలి. ఈనెల 24 నుంచి ఈ కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రారంభించడం జరుగుతుంది. రోజుకు వంది మంది చొప్పున వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశాం. రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తగిన వైద్యం అందించేలా చర్యలు చేపడతాం. దీంతో వారు చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వైసీ శ్రీనివాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

కథ అడ్డం తిరిగింది!


“ ఈ స్థలం ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వీ గ్రామంలో యాదవ సంఘ భవన నిర్మాణం కోసం కేటాయించింది. రూ.5లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటికి అధికారిక మంజూరు కూడా లభించింది. పనుల ప్రారంభంలో జాప్యం వాటిల్లింది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ నిర్మాణం కూడా ప్రశ్నార్థకమే.


“ ఆదిలాబాద్ పట్టణంలోని వార్డు నంబర్–6 ఇందిరమ్మకాలనీలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షల వ్యయంతో సవారీ బంగ్లా వద్ద నిర్మించిన షెడ్ ఇది. ఎలాంటి అగ్రిమెంట్, వర్క్ ఆర్డర్ లేకుండా అడ్వాన్స్‌గా నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎంబీ రికార్డు నమోదు చేసే అవకాశం లేకపోవడంతో నిర్మాణదారుడికి బిల్లుల చెల్లింపు ప్రశ్నార్థకంగా మారింది.

- 'ప్రత్యేక' పనుల ఎంబీ రికార్డుకు నో ఛాన్స్
- ఇప్పటికే పూర్తయిన సవారీ బంగ్లా షెడ్ల నిర్మాణాలు
- బిల్లుల చెల్లింపు ప్రశ్నార్థకమే
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- 'ఎస్‌డీఎఫ్' పనుల పరిస్థితి ఇదీ

కైలాస్‌నగర్: డ్యామిట్ కథ అడ్డం తిరిగింది.. అవును ఆదిలాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్)పనులను పరిశీలిస్తే ఇలాగే అనిపిస్తోంది. పనులకు సంబంధించి ఎలాంటి అగ్రిమెంట్ లేదు.. అధికారుల నుంచి వర్క్ ఆర్డర్ ఉత్తర్వులు లేవు.. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పనులు హడావుడిగా పూర్తయ్యాయి. ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. అయితే కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాలతో ఇలాంటి పనులకు బిల్లుల చెల్లింపు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అడ్వాన్స్‌గా పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు, ప్రతిపక్ష పార్టీల నాయకులు బిల్లులు వచ్చే మార్గం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

ఎన్నికల కోడ్ ముంగిట మంజూరు
ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న రూ.6.20 కోట్ల అంచనాలతో 134 పనులతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేయించారు. సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలు, గ్రావెల్ రోడ్లు, సవారి బంగ్లాలు, ఇతరత్రా పనులను రూ.360.35 లక్షలతో 81 పనులతో కూడిన ప్రతిపాదనలను తయారు చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, గ్రావెల్, సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను రూ. 259.70 లక్షల వ్యయంతో 53 పనులతో కూడిన మరో ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చే రెండు రోజుల ముందు గతేడాది అక్టోబర్ 7వ తేదీన కలెక్టర్ రాహుల్‌రాజ్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అక్టోబర్ 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి రావడంతో ఈ పనులకు ఎలాంటి వర్క్ ఆర్డర్స్, అగ్రిమెంట్ ఇవ్వలేదు. కానీ తర్వాతైన ఎంబీ రికార్డు చేయించుకోవచ్చనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు, అప్పటి అధికారపార్టీ నాయకులు అడ్వాన్స్‌గా పనులు చేపట్టారు.

ప్రభుత్వం మారడంతో ఇబ్బందులు
ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎఫ్ ద్వారా చేపట్టిన పనులన్నింటనీ రద్దు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ఇబ్బందులకు కారణమవుతుంది. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష నుంచి 5లక్షల వ్యయంతో 63 సవారీ బంగ్లాల వద్ద చేపట్టిన షెడ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. వాటిని ఎమ్మెల్యే హోదాలో జోగు రామన్న ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవాలు సైతం చేశారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కొన్ని చోట్ల ప్రారంభం కాకపోగా, మరికొన్ని చోట్ల అసంపూర్తిగా నిలిచాయి. ఇలాంటి పనులన్నింటికి ఎలాంటి వర్క్ ఆర్డర్, అగ్రిమెంట్ లేకపోవడంతో ఎంబీలు రికార్డు చేసేందుకు అవకాశం లేదు. దీంతో పూర్తయిన పనులకు బిల్లులు వస్తాయా రావా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలతో పీఆర్ అధికారులు ఎంబీలను రికార్డు చేయలేని పరిస్థితి ఉండటంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల పరిస్థితేంటని ఆయా వర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కమ్యూనిటీహాళ్లు, యువజన సంఘాల భవనాల మంజూరైనా పనులు ప్రారంభించకపోవడంతో వాటి పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగానే మారింది.

ప్రభుత్వ ఆదేశానుసారం..
ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు రద్దు చేయాలంటూ మాకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే ఎన్నికలకు ముందు చేపట్టిన పనులకు ఎలాంటి వర్క్ అర్డర్, అగ్రిమెంట్ ఉత్తర్వులు లేకపోవడంతో ఇప్పటి వరకు ఎంబీలను రికార్డు చేయలేదు. దీంతో బిల్లుల చెల్లింపు జరుగలేదు. ప్రభుత్వ తదుపరి ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– మహావీర్, పీఆర్ ఈఈ

క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాలతో తులాభారం



తులాభారంలో భక్తులు

నిర్మల్‌టౌన్‌: అయోధ్యలో రాములవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం భగవద్గీత పుస్తకాలతో తులాభారం నిర్వహించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ ఆమెడ శ్రీధర్‌, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆనవాళ్లు లభ్యం

భైంసారూరల్‌: మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన మంగలి సాయి శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయాడు. ఆదివారం సాయంత్రం గుండేగాం వంతెన వద్ద యువకుడి చెప్పులు, చొక్కా కనిపించాయి. అవి సాయి దుస్తువులేనని కుటుంబీకులు గుర్తించారు. వాగులో దూకి ఉంటాడని గజ ఈతగాళ్లతో గాలించిన ఆచూకీ కానరాలేదు. సాయివేసుకున్న బట్టలు వంతెన వద్ద వదిలి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడేమోనన్న కోణంలోనూ పోలీసులు దృష్టిపెట్టారు.

చిన్నారిపై పిచ్చికుక్కదాడి



గాయాలపాలైన చిన్నారి

భైంసా: బాసరలోని బొర్రగణేశ్‌ కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి ఉంగేరి సాహితిపై ఆదివారం పిచ్చికుక్కదాడిలో తీవ్రంగా గాయపడింది. స్థానికులు చిన్నారిని బాసర ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం చిన్నారిని నిజామాబాద్‌ ఆసుపత్రికి తరలించారు. గత కొన్ని రోజులుగా బాసరలో కుక్కలదాడులు పెరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సౌత్‌జోన్‌ పోటీలకు రెఫరీగా ఎంపిక

ఆదిలాబాద్‌: తమిళనాడులోని దిండిగల్‌ పట్టణంలో జరిగే ఖేలో ఇండియా ఉమెన్స్‌ లీగ్‌ సౌత్‌ జోన్‌ యోగాసన పోటీలకు న్యాయ నిర్ణేతగా జిల్లా కేంద్రానికి చెందిన యోగా శిక్షకుడు సంతోష్‌ ఎంపికయ్యారు. స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా, యోగాసనా భారత ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈనెల 26వ తేదీన రిపోర్ట్‌ చేయాలని సంతోష్‌ కు ఎంపిక పత్రం అందింది. న్యాయ నిర్ణేతగా ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ఒకరికి గాయాలు

కడెం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌ మండలం ముత్యంపేట్‌కు చెందిన వ్యక్తి దస్తురాబాద్‌ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌కు హాజరై బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో కడెం ఎస్‌బీఐ సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టి కిందపడ్డాడు. బైక్‌పై ఉన్న వ్యక్తికి తలకు తీవ్ర గాయాలు కావడంతో కారులో నిర్మల్‌లోని ఆసుపత్రికి తరలించారు.

హస్తం కసరత్తు..



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలోని నేతలు

- పార్లమెంట్‌ ఎన్నికల్లో అభ్యర్థిపై కాంగ్రెస్‌ ఫోకస్‌
- ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై ప్రభావం చూపేలా
- బీఆర్‌ఎస్‌ ఓటు చీల్చితే విజయం దక్కుతుందనే విశ్వాసం

సాక్షి, ఆదిలాబాద్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడం ద్వారా విజయం సాధించాలని అధికార పార్టీ కాంగ్రెస్‌ భావిస్తోంది. పార్టీలో టికెట్‌ ఆశావాహులతో పాటు ఇతర రంగాల్లో, ప్రజల్లో పలుకుబడి ఉన్న గిరిజన నేతలపై దృష్టి సారించింది. దాంతో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల ఎంపిక ఎలా ఉంటుంది.. ఎవరైనా అసంతృప్త నేతల్లో వారికి ప్రజాదరణ ఉంటే అలాంటి అభ్యర్థులను కూడా పరిగణలోకి తీసుకోవాలని చూస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ ఎన్నికల సన్నాహక సమావేశం మరోసారి జరిగింది. దీంట్లో నిర్మల్‌, కుమురంభీమ్‌ ఆసిఫాబాద్‌ జిల్లాల అధ్యక్షులతో పాటు కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, టికెట్‌ ఆశావాహులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

ఓటర్లపై ప్రభావం చూపాలి..
కాంగ్రెస్‌ ప్రణాళికలో అభ్యర్థి ఎంపిక విషయంలో ప్రధానంగా ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై ప్రభావం చూపాలని భావిస్తున్నారు. ఆ స్థాయిలో అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. మొన్నటి శాసన సభ ఎన్నికల్లో ఈ పార్లమెంట్‌ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ 2,52,286 ఓట్లు మాత్రమే సాధించి మూడో స్థానంలో నిలిచింది. బీజేపీ 4,48,961 ఓట్లతో రెండవ స్థానంలో నిలువగా, బీఆర్‌ఎస్‌ 4,65,476 ఓట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ప్రధానంగా ఎస్టీ రిజర్వుడ్‌ స్థానాల్లో ఖానాపూర్‌ మినహా బోథ్‌, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్‌ గెలుపొందింది. ఖానాపూర్‌లో గులాబీ పార్టీ రెండవ స్థానంలో నిలిచింది. ఇకపోతే జనరల్‌ స్థానాల్లో ఆదిలాబాద్‌, నిర్మల్‌, ముథోల్‌, సిర్పూర్‌ నియోజకవర్గాల్లో బీజేపీ ప్రభంజనం కొనసాగింది. ఈ నేపథ్యంలో ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై అభ్యర్థి ప్రభావం చూపాలంటే ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కాంగ్రెస్‌ దృష్టి సారించింది. కొత్త అభ్యర్థులైతే సమీకరణాలు ఎలా ఉంటాయి.. ఈ నియోజకవర్గంలో ఇది వరకు పోటీ చేసిన నేతలను బరిలోకి దించితే పార్టీకి ఉపయుక్తంగా ఉంటుందా.. ఇలా అన్ని అంశాలను బేరీజు వేసుకుంటుంది.

బీఆర్‌ఎస్‌ ఓట్లను చీల్చాలి..
ఈ పార్లమెంట్‌ నియోజకవర్గంలో 2019 లోకసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు విజయం సాధించగా, మొన్నటి శాసన సభ ఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందగా, ఇక్కడ ఇలాంటి ఎత్తుగడల ద్వారా ఆ పార్టీని నిలువరించాలనే దానిపై కాంగ్రెస్‌ పార్టీ ప్రణాళిక చేస్తోంది. లోకసభ ఎన్నికల్లో సమీకరణాలు వేరుగా ఉంటాయని, బీజేపీతోనే కాంగ్రెస్‌కు పోటీ ఉంటుందని పార్టీ అంచనా వేస్తుంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ ఓటును ఈ పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలో సగానికి పైగా చీలిస్తే విజయం దక్కుతుందని పార్టీ భావిస్తోంది. ఇవన్నీ సమీకరణ నేపథ్యంలో గిరిజన తెగల్లో లంబాడా అభ్యర్థిని బరిలోకి దించితే ఎలా ఉంటుంది.. ఆదివాసీ అభ్యర్థి అయితే ప్రయోజనం ఉంటుందా అనే అంశాలను పరిశీలన చేస్తున్నారు. సన్నాహక సమావేశంలో ఇలాంటి అంశాలపై కాంగ్రెస్‌ పార్టీ దృష్టి పెట్టిందని ముఖ్యనేతలు తెలిపారు. అంతే కాకుండా బూత్‌, మండల, పట్టణ స్థాయిల్లో కమిటీలను పటిష్టపర్చడం, సోషల్‌ మీడియాను విస్తృత పర్చడం, చేరికలపై దృష్టి సారించడం అనే అంశాలపై ఆ పార్టీ చర్చలు చేసింది. మొత్తంగా అభ్యర్థి ఎంపికపై పార్టీ సీరియస్‌గా దృష్టి సారించింది.

కోలుకుంటున్న రాకేశ్‌..

- ఆపన్నహస్తం అందించిన దాతలు

సాక్షి స్పందన



కోలుకుంటున్న రాకేశ్‌ను పరామర్శిస్తున్న బ్లడ్‌డోనర్‌ గ్రూప్‌ అడ్మిన్‌ సురేశ్‌

భైంసాటౌన్‌: పట్టణంలోని కిసాన్‌ గల్లికి చెందిన రాకేశ్‌(రోబో) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలైన విషయం తెలిసిందే. మెదడులో పలుచోట్ల రక్తం గడ్డ కట్టడంతో వైద్యులు ఆపరేషన్‌ చేయాలని, అందుకు రూ.8లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో బాధితుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఈనెల 1న 'ఆపన్నహస్తం అందించరూ' అన్న శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన దాతలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా తోచిన సహాయం అందజేశారు. వైద్యులు ఆపరేషన్‌ చేయడంతో ప్రస్తుతం రాకేశ్‌ కోలుకుంటున్నాడు. తనకు ఆర్థికసహాయం అందించి ఆదుకున్న దాతలకు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శంగా నిలుస్తున్న యువత..
సాటి మనిషికి ఏమైతే మనకెందుకులే అనుకునే ఈ రోజుల్లోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు భైంసాకు చెందిన కొందరు యువకులు. ఆపద ఏదైనా తామున్నామంటూ అండగా నిలబడుతున్నారు. వారు చేసేది చిన్నపాటి ఉద్యోగాలే అయినా.. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సైతం అంతంతమాత్రమే అయినా సాటిమనిషిని ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుంటున్నారు. వారే భైంసాకు చెందిన బ్లడ్‌ డోనర్స్‌, అయోధ్యభారతి గ్రూప్‌ సభ్యులు రాకేశ్‌ స్నేహితులు అతనికి సాయం చేయాలనే ఉద్దేశంతో విరాళాల సేకరణకు విస్తృతంగా కృషి చేశారు. సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌ చేసి ఆర్థిక సహాయం అందించాల్సిందిగా కోరారు. దీంతో దాతలు స్పందించి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆర్థికసహాయం అందజేశారు. పట్టణంలోని ప్రముఖులు, వైద్యులను కలిసి రూ.6 లక్షల వరకు విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. దీంతో ప్రస్తుతం రాకేశ్‌ కోలుకోగా, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో అండగా నిలిచిన బ్లడ్‌ డోనర్స్‌ గ్రూప్‌ అడ్మిన్‌ సురేశ్‌తో పాటు అయోధ్య భారతి సేవా టీం సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

వాగులో పడి మహిళ మృతి



ఆశమ్మ (ఫైల్‌)

నేరడిగొండ: మతిస్థిమితం లేని మహిళ వాగులో పడి మృతిచెందిన సంఘటన మండలంలోని వాంకిడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం.. నారాయణపూర్‌ గ్రామానికి చెందిన బడుగు ఆశమ్మ(56) పదేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన ఆమె అర్ధరాత్రి నుంచి ఇంట్లో కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కలా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వాంకిడి వాగులో మృతదేహం తేలింది. స్థానికులు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఆశమ్మగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదేళ్లకే అబ్బురపరుస్తున్న హిమాన్షు

- సెకండ్ల వ్యవధిలో రాష్ట్రాలు – రాజధానుల పేర్లు
- ఆంగ్ల అక్షరాలతో పురాణ పురుషుల పేర్లు సైతం



హిమాన్షు

భైంసాటౌన్‌: పట్టణానికి చెందిన జిలకరి హిమాన్షు ఐదేళ్ల వయసుకే అబ్బురపరుస్తున్నాడు. వయసుకు మించి ప్రతిభతో రాణిస్తూ అందరిచేత ఔరా అనిపించుకుంటున్నాడు. భైంసా పట్టణానికి చెందిన జిలకరి రాజేశ్వర్‌–రజిత దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు కాగా వీరికి ఇద్దరు సంతానం. పెద్దవాడైన హిమాన్షు ప్రస్తుతం గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్‌ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుండగా, సెకండ్ల వ్యవధిలో అన్ని రాష్ట్రాలు–రాజధానుల పేర్లు చెబుతూ ఆశ్చర్యపరుస్తున్నాడు. అంతేగాక తోటి పిల్లలు ఏ ఫర్‌ ఆపిల్‌, బి ఫర్‌ బాల్‌ అని నేర్చుకుంటుంటే తను మాత్రం ఆంగ్ల అక్షరాలతో పురాణ పురుషుల పేర్లు కంఠస్తంగా చెబుతుండడంతో ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఏ ఫర్‌ అర్జున, బి ఫర్‌ బలరామ అంటూ జెడ్‌ ఫర్‌ జాంబవంత వరకు పురాణ పురుషుల పేర్లు పొల్లు పోకుండా చెబుతున్నాడు. తల్లిదండ్రులు సైతం తమ కుమారుడి ప్రతిభ చూసి మరింత ప్రోత్సహిస్తున్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తాం

ఆదిలాబాద్‌రూరల్‌: రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా ప్రతి యేటా సమాత సైనిక్‌ దళ్‌ ఆధ్వర్యంలో శ్రామ్నేర్‌ శిబిరం నిర్వహిస్తున్నామని ఎస్‌ఎస్‌డీ రాజ్యాబౌధిక్‌ ప్రముఖ్‌, న్యాయవాది మహేంద్ర అన్నారు. ఆదిలాబాద్‌ పట్టణంలోని అశోక బుద్ధ వీహర్‌లో కొనసాగుతున్న శ్రామ్నేర్‌ శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ బుద్దుడికి పూజలు చేశారు. అనంతరం శిక్షణ అందిస్తున్న తీరును దక్షిణ భారత సంఘటకులు దీపక్‌ వాఘ్మరే ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు వారికి అనుకూలంగా అనునిత్యం రాజ్యాంగంపై దాడులు, మార్పులకు ప్రకటనలు చేస్తున్నారన్నారు. దీనిపై ప్రజలతో పాటు అంబేద్కర్‌ వాదులకు అవగాహన కల్పించేలా ప్రతి సంవత్సరం జనవరి 17 నుంచి 26 వరకు శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందులో రాజ్యాంగ పరిరక్షణపై అవగాహనతో పాటు పలు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జనవరి 26న పట్టణంలో సమాత సైనిక్‌ దళ్‌ మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు బంతే బుద్ధ ఘోష్‌, విశ్వ భూషన్‌, రమాకాంత్‌, హర్షవర్ధన్‌ ఉన్నారు.

సాయం అందించండి..

- బ్రెయిన్‌ ట్యూమర్‌తో బాధపడుతున్న యువకుడు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



బోరి ప్రవీణ్‌

జైనథ్‌: ఆదిలాబాద్‌ జిల్లా జైనథ్‌ మండల కేంద్రానికి చెందిన బోరి ప్రవీణ్‌(30) బ్రెయిన్‌ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ప్రైవేట్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో అతడిని మహారాష్ట్రకు తీసుకెళ్లారు. కాగా పరిశీలించిన వైద్యులు, బ్రెయిన్‌లో ట్యూమర్‌ ఉన్నట్లు తెలిపారు. ఈ ట్యూమర్‌ తొలగించేందుకు దాదాపుగా రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో నిరుపేదలైన కుటుంబీకులు ప్రవీణ్‌ను ఇంటికి తీసుకొచ్చారు.ఈ విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు అతడి ఆరోగ్య పరిస్థితిపై సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేయడంతో కొంత మంది దాతలు స్పందించారు. బాధితుడి మిత్రులతో పాటు గ్రామస్తులు, ఇతర దాతలు కలిసి ఇప్పటివరకు రూ. 1.40లక్షలు అందించగా, మరో రూ. 4లక్షల వరకు డబ్బులు అవసరం ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

రిమ్స్‌కి తరలింపు...
ప్రవీణ్‌ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో అతడిని మొదటగా నిజామాబాద్‌కు తరలించారు. కాగా అక్కడ పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్‌ చేయడంతో ఆదివారం తరలించారు. దాతలు ముందుకు వచ్చి, సహాయం చేస్తేగాని అతని సర్జరీ అయ్యే అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు దాతల సహాయం కోసం వేడుకుంటున్నారు.

ఎడ్లబండిని ఢీకొని ఒకరి మృతి

- తరోడ మూలమలుపు వద్ద ప్రమాదం
- తండ్రి మృతి, కూతురు స్వల్ప గాయాలు



రాజన్న మృతదేహం

జైనథ్‌: మండలంలోని తరోడ మూలమలుపు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బెల్గాంకు చెందిన కట్కం రాజన్న (45) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... రాజన్న తన కూతురు తనూజతో కలిసి ఆదివారం బైక్‌పై పూసాయి జాతరకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం తరోడ బ్రిడ్జి దాటిన తరువాత మూలమలుపు వద్ద ఎడ్లబండిని ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కూతురు తనూజకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఇద్దరిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించగా పరిశీలించిన వైద్యులు రాజన్న అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య పుష్పల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సాయంత్రం అతడి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

వేతనాలు చెల్లించాలి



ట్రిపుల్‌ఐటీ గేటు ఎదుట కార్మికుల ధర్నా

భైంసా: ట్రిపుల్‌ఐటీ కార్మికులవేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్‌ అన్నారు. ఆదివారం ప్రధానగేటు ఎదుట సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దినమంతా కష్టపడే కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు.

రామభక్తిని చాటుకుంటూ..

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని పలువురు రాముడిపై భక్తిని వివిధ రూపాల్లో చాటుకుంటున్నారు. నేడు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానికంగా పలువురు పలు రకాలుగా తమ భక్తిని ప్రదర్శిస్తున్నారు. స్థానిక రామాలయాలను శుద్ధిచేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే వివిధ ఆకృతుల్లో శ్రీరాముడిని చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు.


అట్ట ముక్కలతో రామాలయ నమూనా



నమూనాను చూపిస్తున్న స్వామి, ప్రవీణ్‌

తాంసి: అయోధ్యలో రామ మందిరంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పలువురు భక్తులు తమకు తోచిన విధంగా భక్తిని చాటుకుంటున్నారు. తాంసి మండలంలోని హస్నాపూర్‌ గ్రామానికి చెందిన కర్నేవార్‌ స్వామి, వరుసకు అల్లుడైనా ప్రవీణ్‌తో కలిసి రాముడిపై ఉన్న భక్తిని ఇలా చాటుకున్నారు. హస్నాపూర్‌ గ్రామానికి చెందిన స్వామి, ఖానాపూర్‌కు చెందిన ఎన్నావార్‌ ప్రవీణ్‌ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అట్ట ముక్కలు, ,థర్మకోల్‌ పరికరాలతో అయోధ్య రామాలయం నమునాను సిద్ధం చేసి స్థానిక గ్రామంలోని ఆలయంలో ఉంచి భక్తిని చాటుకున్నారు. అయోధ్య నమూనాను తయారు చేసిన యువకులను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

శ్రీరామ పాదుకలు చేసి..





వజ్రాచారి

నిర్మల్‌: నిర్మల్‌ జిల్లా కేంద్రానికి చెందిన వజ్రాచారి తన రామభక్తిని చాటుకున్నారు. తన చేతివృత్తితో అద్భుతమైన శ్రీరామ పాదుకలను తయారు చేశారు. టేకు కర్రపై శంకుచక్రాలు, ఏనుగులు, శ్రీరామ ఆయుధాలతో ఆకట్టుకునేలా పాదుకలను రూపొందించారు. వజ్రాచారి గతంలో కర్రతో తయారు చేసిన భారీ కర్ర గణపతి ప్రతిఏడాదీ వినాయకచవితికి పూజలందుకుంటోంది.

రాములోరి చిత్రాలు





నవీన్‌రెడ్డి గీసిన చిత్రాలు

కుంటాల: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని కల్లూర్‌ గ్రామస్తులు పడమర ముఖి హనుమాన్‌ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగులు వేయించి విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. వీరికి తోడు గ్రామానికి చెందిన కళాకారుడు యానంపల్లి నవీన్‌రెడ్డి తనవంతుగా ఆలయ గోడలపై శ్రీరామ, హనుమాన్‌ చిత్రపటాలను అందంగా వేసి రామ భక్తిని చాటుకున్నాడు.

సేవ చేయడం అదృష్టం...



అయోధ్యలోని శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇటీవల గ్రామానికి అక్షంతలు చేరుకున్నప్పటి నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ఆలయాన్ని అందంగా అలంకరింపజేశారు. నా వంతుగా ఆలయ గోడల పైన చిత్రాలను వేశాను. ఈ చిన్ని సహాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా.
– యానంపల్లి నవీన్‌రెడ్డి

రామయ్యకు 'కళా'నీరాజనం..



రాముడి మట్టి శిల్పం







బీవీఆర్‌ చారి విఘ్నశుభంకరి శాంకరి

నిర్మల్‌: మట్టి ముద్దను అయోధ్యలో కొలువుదీరనున్న బాల రాముడిగా చేసి తన కళతో ప్రాణం పోశాడు తెలంగాణ తల్లి రూప శిల్పి బైరోజు వెంకటరమణాచారి(బీవీఆర్‌చారి). ఆయన బిడ్డలిద్దరూ తండ్రి బాటలోనూ తమదైన చిత్రకళతో శ్రీరాముడికి చిత్ర నీరాజనం పలికారు. నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేటకు చెందిన బీవీఆర్‌.చారి, వారి ఇద్దరు కుమార్తెలు శాంకరి, విఘ్నశుభంకరి కలిసి తమ కళలతో ఇలా అయోధ్య రాముడిని సాక్షాత్కరింపజేశారు. ముగ్గురూ ఆదివారం వేర్వేరుగా రెండు గంటలపాటు శ్రమించి ఈ మట్టిశిల్పం, పెన్సిల్‌ స్కెచ్‌లను రూపొందించారు.

వినియోగదారులకు ఇక్కట్లు



రాజీవ్‌నగర్‌లో సిలిండర్‌ డెలివరీ చేస్తున్న వైనం

ఖానాపూర్‌: పట్టణంలో హెచ్‌పీ గ్యాస్‌ సిలిండర్‌ కోసం వెళ్లిన వినియోగదారులకు శనివారం గ్యాస్‌ సిలిండర్‌ బుకింగ్‌ రసీదు ఒక చోట, గ్యాస్‌ సిలిండర్‌ డెలివరీ మరోచోట ఉండడంతో నానా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సుమారు కిలోమీటర్‌ నుంచి రెండు కిలోమీటర్ల వ్యత్యాసం ఉండడంతో మహిళలు, వృద్ధులు వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చింది. కాగా పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్‌ సిలిండర్‌ వినియోగదారులు ఈకేవైసీ కోసం నానా ఇక్కట్లు పడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. హెచ్‌పీ గ్యాస్‌ ఈకేవైసీ కావాలంటే నిర్మల్‌కు రావాలని డెలివరీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఖానాపూర్‌లో సబ్‌ ఏజెన్సీ ద్వారా ఈకేవైసీ చేసే అవకాశం కల్పించాలని లబ్ధిదారులంటున్నారు.

పూసాయికి పోటెత్తిన భక్తజనం

- కనుల పండువగా జాతర
- భారీగా తరలివచ్చిన భక్తులు
- భక్తజన సందోహంగా మారిన ఎల్లమ్మ ఆలయం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్‌: మండలంలోని పూసాయి గ్రామానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. పూసాయి ఎల్లమ్మ తల్లి జాతరకు భక్తులు భారీగా తరలిరావడంతో కనుల పండువగా సాగింది. జాతర రెండవ ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైనథ్‌ మండలంతో పాటు బేల, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్‌ మండలాలు, నిర్మల్‌, నిజామాబాద్‌ జిల్లాల నుంచే కాక మహారాష్ట్రలోని పాండర్‌కౌడ, యవత్‌మాల్‌, బోరి నుంచి భక్తులు వచ్చి ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రతీ సంవత్సరం పుష్య మాసంలో నెల రోజులపాటు ఇక్కడ జాతర నిర్వహించడం జరుగుతుంది. ఆదివారం, మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరుగుతుంది. అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి విచ్చేసిన భక్తులు ముందుగా ఆలయం ఎదుట ఉన్న నీటి ఊటలో స్నానాలు ఆచరించారు. ఎల్లమ్మ గర్భ గుడి నుంచి వచ్చే జలధార కోనేరులో స్నానాలు చేస్తే వివిధ చర్మ రోగాలతో పాటు, వ్యాధులు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. గతంలో మొక్కులు మొక్కుకున్నవారు అమ్మవారి సన్నిధిలో కోళ్లు, మేకలు కోసి నైవేద్యం సమర్పించుకున్నారు. అక్కడే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ జాతరలో భారీగా దుకాణాలు వెలిసాయి. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో జాతర మొత్తం హోరెత్తింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రాంపూర్‌ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై విష్ణువర్ధన్‌ కథనం ప్రకారం... ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని పాచ్పర గ్రామంలో ఆదివారం పోచమ్మ దేవతకు పూజలు చేశారు. అక్కడ దేవతకు బలిచ్చినా మేకను తీసుకుని ద్విచక్ర వాహనంపై కరదరపు దత్తు, షేకురి అశోక్‌ పాచ్పర నుంచి మావల గ్రామంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌కు తీసుకువస్తున్నారు. మార్గమధ్యలోని రాంపూర్‌ సమీపంలో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరికల డ్రమ్ములకు దత్తు వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్‌ వెనుక కూర్చున్న అశోక్‌ (44) కింద పడగా తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అశోక్‌ మృతి చెందాడు. దత్తుకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.